
## గొంతు నొప్పే.. నో ప్రాబ్లమ్!

**చలికాలంలో** వేధించే ఆరోగ్య సమస్యల్లో గొంతు నొప్పి ఒకటి. చలి వాతావరణంతోపాటు హానికారక బ్యాక్టీరియా, వైరస్‌లవల్ల గొంతు ఇన్‌ఫెక్షన్ వస్తుంది. దీనివల్ల అన్నం తినడం, నీళ్లు తాగడం కూడా కష్టమవుతుంది. అయితే.. వంటింట్లోనే దొరికే పసుపు, మిరియాలు, లవంగాలతోనే గొంతు నొప్పికి చెక్ పెట్టవచ్చు.

- పసుపు-పాలు.. గొంతు సమస్యలకు అద్భుతమైన పరిష్కారం. ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. గ్లాసు గోరువెచ్చని పాలలో రెండు చిటికెల పసుపును కలిపి తాగితే.. గొంతు ఇన్‌ఫెక్షన్లు ధరిచేరవు.
- లవంగాలు.. శక్తిమంతమైన యాంటి సెప్టిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇందులో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం.. గొంతులోని బ్యాక్టీరియాను చంపేస్తుంది.
- మిరియాల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఎక్కువ. ఇందులో లభించే పైపెరిన్ అనే సమ్మేళనం.. గొంతులో వాపు, మంటను తగ్గించడంలోనూ సాయపడుతుంది. ఇందులోని యాంటి బ్యాక్టీరియల్ గుణాలు.. ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే బాక్టీరియాను నాశనం చేస్తాయి.
- ఒక టేబుల్ స్పూన్ తేనెలో చిటికెడు నల్ల మిరియాల పొడి కలిపి తీసుకుంటే.. గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు కలిపి, ప్రతిరోజూ ఉదయం పుక్కిలిస్తే.. గొంతు నొప్పి దూరమవుతుంది.
- ఒక టీస్పూన్ తేనెలో రెండుమూడు తులసి ఆకుల రసాన్ని పిండి.. తాగినా గొంతునొప్పి తగ్గుతుంది.




## చిన్నారులకు పౌడర్

**కాలమేదైనా..** చిన్నారుల స్నానం పూర్తయ్యిందంటే, వారి ఒంటినిండా పౌడర్ రాయాల్సిందే! దీనివల్ల చెమట పట్టకుండా ఉండి, పిల్లలు ఎక్కువసేపు ఫ్రెష్‌గా ఉంటారనేది తల్లిదండ్రుల భావన! చెడువాసన దూరమై.. పిల్లల నుంచి సువాసన వస్తుందని కూడా చాలామంది నమ్మిక! అయితే, సరైన జాగ్రత్తలు పాటించకుంటే.. 'పౌడర్' వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని హెచ్చరిస్తున్నారు ఆరోగ్యనిపుణులు. పిల్లలకు పౌడర్ వేసేటప్పుడు అది గాలిలో కలిసిపోయి.. వారి ముక్కు, నోటి ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరే ప్రమాదం ఉంటుందట. దీనివల్ల పిల్లల్లో శ్వాస సంబంధ సమస్యలతోపాటు క్యాన్సర్‌వంటి ప్రమాదకరమైన వ్యాధులనూ కలిగిస్తాయట. చాలా కంపెనీల బేబీ పౌడర్‌లలో 'టైలాగ్' అనే ఖనిజ సమ్మేళనం ఉంటుందనీ, ఇందులోని ఆస్‌బెస్టాస్ అనే పదార్థం.. క్యాన్సర్‌ను కలగజేస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, పిల్లలకు పౌడర్ రాసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.



- ఏ కాలంలోనైనా.. పిల్లలకు పౌడర్‌ను మితంగానే వాడాలి.
- పౌడర్‌ను నేరుగా కాకుండా.. మొదట ఏదైనా గుడ్డపై పోసి, ఆ తర్వాతే పిల్లల ముఖానికి రాయాలి.
- పౌడర్ రాసేటప్పుడు అది పిల్లల కళ్లలోకి, నోటిలోకి, ముక్కులోకి వెళ్లకుండా చూసుకోవాలి.
- స్నానం పూర్తయిన వెంటనే.. పిల్లల చర్మానికి పౌడర్ వేయడం మంచిదికాదు. చర్మం పూర్తిగా తడారిన తర్వాతే పౌడర్ రాయాలి.
- ఇక పిల్లల ప్రైవేట్ భాగాలకు పౌడర్ వేయడం చాలా ప్రమాదకరం. ఇలా చేయడం వల్ల పిల్లల్లో అలెర్జీలు, చికాకు లాంటి సమస్యలు కలుగుతాయి.
- అన్నిటికన్నా ముఖ్యంగా.. పిల్లల కోసం పౌడర్‌ను కొనేముందు, అది నాణ్యమైనదేనని నిర్ధారించుకోవాలి. వైద్యులు సూచించిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం మంచిది.

## ఆడవాళ్లలోనే ఆ ముప్పు

**పురుషులతో** పోలిస్తే మహిళల్లో గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువని అనేక అధ్యయనాలు తేల్చాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌తోపాటు యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ సంస్థ కూడా.. ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి. ఆధునిక జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా.. మహిళల్లో ఈ హృద్రోగ కేసులు పెరుగుతున్నాయి. వయసు పైబడటం, హార్మోన్ల ప్రభావం అతివల గుండెను బలహీనపరుస్తున్నాయి. అధిక రక్తపోటు, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక రుగ్మతలు.. మహిళల్లో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతున్న



దట. రక్తంలో చక్కెర స్థాయులు పెరగడం వల్ల రక్తనాళాలు దెబ్బతింటాయి. ఫలితంగా రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడి స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. 55 ఏళ్లు దాటినవాళ్లలో గుండెజబ్బుల ముప్పు ఎక్కువగా ఉంటున్నదట. మెనోపాజ్ సమయంలో వచ్చే హార్మోన్ మార్పుల వల్ల.. రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ లెవెల్స్ తగ్గడం కూడా.. రక్తనాళాల్లో వాపు, అధిక రక్తపోటుకు కారణం అవుతుంది. ఇక.. పురుషులతో పోలిస్తే మహిళల రక్త ధమనులు ఇరుకుగా ఉంటాయట. ఫలితంగా వారిలో బీపీ పెరిగి.. గుండెపోటుకు దారి తీస్తుంది. వీటితోపాటు ఊబకాయం, మానసిక ఒత్తిడి, నిరాశ వంటివి కూడా ఆడవాళ్లలో హార్ట్ ఎటాక్స్ రావడానికి కారణం అవుతున్నాయి. అలాగే బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్, గర్భధారణ సమస్యలు లాంటి పరిస్థితులు కూడా.. గుండె జబ్బుల ప్రమాదానికి దోహదం చేస్తున్నాయి.

### లక్షణాలు వేరుగా..

పురుషులతో పోలిస్తే.. మహిళల్లో గుండెపోటు లక్షణాలు వేరుగా ఉంటున్నాయని హృద్రోగ నిపుణులు అంటున్నారు. సాధారణంగా ఛాతీలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, వికారం, తల తిరగడం, చలి చెమటలు పట్టడం.. కామన్‌గా కనిపించే లక్షణాలు. వీటితోపాటు ఆడవాళ్లలో మెడ, దవడ, గొంతు, కడుపుతోపాటు వీపుసహా వివిధ భాగాల్లో నొప్పిలాంటి లక్షణాలు ఉంటున్నాయట. వాంతులు, వికారం వంటివీ కనిపిస్తున్నాయట. అందుకే, ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఒక భాగమైన 'ధూం ధాం' మళ్లీ గజ్జె కడుతున్నది. ఆటపాటలతో తెలంగాణవాదాన్ని వాడవాడకూ తీసుకెళ్లిన 'ధూం ధాం' మరోసారి గొంతు సవరించుకుంటున్నది. సమైక్యకాలం నాటి దుర్భర ఛాయలు మళ్లీ కనిపిస్తుండటంతో వాటిని సమూలంగా పాతరేసేందుకు, దగాపడ్డ చెల్లెళ్ల ఆశలు నిలబెట్టేందుకు, కల్లంలో గింజలున్నా.. పళ్లెంలో మెతుకులేని రైతన్నల వెతలు బాపేందుకు, బతుకమ్మను మన నుంచి విడదీసే కుట్రను బయటపెట్టేందుకు, సాంస్కృతిక విధ్వంసానికి అడ్డుకట్ట వేసేందుకు తన పోరాటం అంటున్నాడు తెలంగాణ ఉద్యమకారుడు **రసమయి బాలకిషన్**. మార్పు పేరిట తెలంగాణను అరిగోస పుచ్చుకుంటున్న కాంగ్రెస్‌ను ప్రశ్నించడానికి రాష్ట్రవ్యాప్తంగా 'ధూం ధాం' నిర్వహిస్తానని అంటున్నాడు. చార్‌సౌబీస్ హామీలిచ్చి మాట తప్పినోడిపై.. మడమ తిప్పని పోరాటం చేస్తానంటున్న రసమయి బాలకిషన్ 'జిందగీ'తో పంచుకున్న 'ధూం ధాం' ముచ్చట్లు..

## కాళోజీ కలం సాక్షిగా

# ఈడనే బొందవెడ్తం

**మాట తప్పినోడిపై మడమ తిప్పని పోరాటం చేస్తం**

**ఉద్యమ కాలం నుంచి తెలంగాణతో మమేకయ్యారు. గడిచిన ఏడాదిలో రాష్ట్రంలో ఎలాంటి మార్పులు గమనించారు?**

**రాష్ట్రంలోని** ప్రజలు ఆశలు వదులుకున్నారు. 'నమ్మి నానబోస్తే.. పుచ్చి బుడాలైనట్లు' ఉంది రాష్ట్రంలో పరిస్థితి. అందుకే 'నమ్మి నానబోస్తే' అని షార్ట్‌ఫిల్మ్ తీశాం. ప్రజలు ఏమనుకుంటున్నారో అవే చెప్పాం. 'మోసపోయి గోస పడుతున్నాం' అని అందరూ బాధపడుతున్నారు. 'పాలిచ్చే బర్రెను వదిలేసి, తన్నే దున్నపోతును తెచ్చుకున్నామ'ని ఆవేదన చెందుతున్నారు. నేను ఏ ఇంటికి పోయినా.. ఇవే కథలు, ఇవే వెతలు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై అబద్ధాలను ప్రజల్లో ఎండగట్టేందుకే మళ్లొక పోరాటం చేయాల్సిన అవసరమొచ్చింది.

**మీ పోరాటాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలని భావిస్తున్నారు?**

**తెలంగాణ** రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ఎలా ఆవిర్భవించిందో.. అలాగే 2002లో సెప్టెంబర్ 30న 'తెలంగాణ ధూంధాం'ను ఏర్పాటుచేశాం. స్వరాష్ట్ర సాధన కోసం విభిన్నమైన కళాకారులను ఒక వేదికమీదకు తీసుకొచ్చాం. ఆటాపాట నిషేధించిన రోజుల్లో కూడా 'ధూంధాం' రాష్ట్రమంతా మార్మోగింది. అనుకున్న లక్ష్యాన్ని సాధించాం. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఆకాంక్షలన్నీ నిర్వీర్యమవుతున్నాయి. పదేండ్లపాటు వందేండ్ల అభివృద్ధి చూసి, గడిచిన ఏడాదిగా వేళ్లూనుకుంటున్న నాటి 'సమైక్య' పరిస్థితులు చూడలేక మళ్లీ గజ్జె కడుతున్నాం. 'ధూంధాం' పోరాట పంథాలోనే ప్రజల్లోకి వెళ్లాలనుకుంటున్నాం.



**ఏడాదిలోనే అంత మార్పు గమనించారా?**

**తెలంగాణ** ఏర్పాటే 'ధూంధాం' లక్ష్యంగా ఉండేది. గతంలో 'పండగేడిది పబ్బమేడిది? తల్లి పిల్లలనక, అయ్యో పొద్దుబాపు కష్టమని, మక్కజొన్నలాంటి మట్టిపాటలేడివి?' అని, 'చేదానమేడుందిరా తెలంగాణ చేలన్నీ బీడురా' అంటూ కన్నీళ్ల పాటలు పాడుకున్నం. 'ఉండు పైలంగుండు అమ్మ మాయమ్మ.. బొంబాయి పోతుండు' అనే వలస పాటలు ఎత్తుకున్నం. కేసీఆర్‌గారి పోరాట దీక్షతో తెలంగాణ కల సాకారమైంది. వారి నాయకత్వంలో దశాబ్దాల గోస తీరింది. నాడు ఆవేదనతో పాడుకున్న పాటలను మర్చిపోయేలా వారి పాలన సాగింది. పదేండ్లలోనే ఊహించని మార్పు చోటుచేసుకుంది. ఎక్కడ చూసినా పల్లెపల్లెనా పచ్చని చేన్లు.. నిండుగా కుంటలు, చెరువులు, నీళ్ల నిండా చేపలు, ప్రాజెక్టులు, చేన్లలో పుట్లకొద్దీ ఒడ్లు యావత్ తెలంగాణ ఇవే దృశ్యాలు కనిపించాయి. కానీ, ఏడాదిలోనే అంతా తలకిందులైంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిరంకుశ వైఖరి, సమైక్యవాదన వల్ల మళ్లీ పాతకాలం నాటి పరిస్థితులు దాపురిస్తున్నాయి. అందుకే మా ధూంధాం.

> **అన్ని ఉత్తయే**
>
> **పాటలనే** తూటాలుగా, అక్షరాలనే ఆయుధాలుగా.. తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో 'ధూంధాం' దుమ్మురేపింది. ఇప్పుడు అదే అస్త్రంతో ప్రజలను చైతన్యవంతులను చేస్తాం. మరో మార్పు కోసమే ఈ ప్రయత్నం. గతంలో 'అయ్యోనివా నువ్వు అవ్వోనివా.. తెలంగాణనోనికి తోటి పాలోనివా?' అని ఎట్ల ప్రశ్నించినమో.. ఆరు గ్యారెంటీలపై, 420 హామీలపై రేవంత్ రెడ్డిని నిలదీస్తాం. రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, రైతు భరోసాపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఉత్తముచ్చటని తేలిపోయింది. ఎక్కడికి వెళ్లినా 'అన్ని ఉత్తయే.. అన్ని ఉత్తయే' అని ప్రజలు చెబుతున్నరు. ఆ మాటల్లోంచి కట్టిందే 'అన్ని ఉత్తయే' అన్న పాట. తెలంగాణను కాపాడుకోవడం కోసం.. మరిన్ని కళారూపాలతో ప్రజల్లోకి వెళ్తాం.

**ప్రజలు ఒక మార్పును కోరుకున్నారు కదా.. అది నెరవేరలేదని అంటారా?**

**మాకు** గ్యారెంటీలు కావాలని, 420 హామీలు ఇవ్వాలని, రుణమాఫీ చేయమని ప్రజలు కోరలేదు. అన్నీ రేవంత్ రెడ్డే చెప్పిండు. కానీ, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలుచేయడం చేతగాక.. కొత్తకొత్త వాగ్దానాలు చేస్తున్నడు. ఏడాదిగా ప్రజలను మభ్యపెట్టడంతో పాటు, మన సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తున్నడు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పు అలాంటిదే. తెలంగాణను మళ్లీ ఆకలి చావుల దిశగా తీసుకుపోతున్నడు!

**'ధూంధాం' ప్రణాళిక సిద్ధం చేసుకున్నారా?**

**ఏ** ప్రజల కోసమైతే ఆ రోజు 'తెలంగాణ ధూంధాం' నిర్వహించామో.. అదే ప్రజల కోసం, తెలంగాణను తిరిగి కాపాడుకోవడం కోసం మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా 'ధూంధాం' నిర్వహిస్తం. ఇదేమీ అక్కసుతో చేస్తున్నది కాదు. ఏడాదిలోనే శాంతిభద్రతలు అదుపు తప్పాయి, లాఠీచార్జీలు పెరిగాయి, లగచర్ల, దిలావర్‌పూర్ తిరుగుబాటు, రైతులకు సంకెళ్లు వేసి తీసుకుపోయేటంత దుర్భర పరిస్థితుల్లోకి తెలంగాణను నెట్టారు నేటి పాలకులు. రుణమాఫీ కాక, రైతుభరోసా లేక, ఒడ్లు కొనే నాథుడు రాక రైతులు అల్లాడుతున్నరు. ఇంతకంటే ఘోరమైన, అమానుషమైన ఘటనలు ఎన్నో ఉన్నయ్. కాంగ్రెస్‌ను ఎన్నుకొని ప్రజలు పడుతున్న గోసను ఊరూవాడా వినిపిస్తం.

**ఎంతోమంది, ఎన్నో రూపాల్లో ఉద్యమంలో పాలుపంచుకున్నారు. ఇవాళ ప్రభుత్వం కొందరిని మాత్రమే సన్మానించడం ఎలా చూస్తారు?**

**పాలకుల** వెనుక బానిస కవులు ఉంటే ఇలాంటివే జరుగుతాయి. అసలైన వారికి న్యాయం జరగదు. ఈ ముఖ్యమంత్రికి ఉద్యమ చరిత్ర లేదు. ఆయనకేం తెలుస్తుంది? ఆ ఎంపికకు ఏ కొలమానమో తెలియదు. రేవంత్‌రెడ్డి అనే వ్యక్తి మా అసొంటి ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాల్సిన పనిలేదు. నన్ను ప్రజలు గుర్తించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. సాంస్కృతిక సారథి చైర్మన్‌గా సేవ చేసే భాగ్యం కల్పించారు. కేసీఆర్ గారి నిర్ణయం మేరకు వందలాది కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాభిమానం ముందు.. రేవంత్‌రెడ్డి ఇచ్చే అవార్డులు, రివార్డులు అవసరం లేదు. నేను ప్రజల్లోకి వెళ్తే.. 'ఓ పాట పాడు బిడ్డా' అని అంటారు. అదే నా గుర్తింపు.

**నందిని సిధారెడ్డి ఈ అవార్డును తిరస్కరించారు.. కారణం?**

**నిజమైన** ఉద్యమకారులెవరూ వాటిని స్వీకరించరు. 'నువ్వెంది గుర్తించేది' అని ఆయన తిరస్కరించిండు. ముఖ్యమంత్రి కోసం, పైసల కోసం పాటలు రాయలేదని, తెలంగాణ ఆకాంక్ష కోసం రాశానని ధైర్యంగా చెప్పిండు. కాంగ్రెస్ ఆస్థాన కవులు అని ప్రభుత్వం ఈ అవార్డులు ప్రకటించాల్సింది. ప్రజలు కూడా ఆ పేర్లను చూసి నవ్వుకుంటున్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది పాటలు పాడినోళ్లు ఉన్నారు. గద్దర్, విమలక్క, జయరాజ్, అందెశ్రీ లాంటి వారికి 'ధూంధాం' ఒక వేదికైంది. మలివిడత ఉద్యమంలో సాంస్కృతిక సారథిగా నిలిచింది. 'ధూంధాం' ద్వారా వారందరినీ ప్రజల్లోకి తీసుకెళ్లాం. వాళ్లనూ, వారి పాటలనూ నిలబెట్టాం. కానీ, ఆ వేదికను నిలబెట్టిన వారిని గుర్తించలేకపోతున్నారు.

**బతుకమ్మ బహుజనుల పండుగ కాదని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. దీన్నెలా అర్థం చేసుకోవాలి?**

**ఓ** మూర్ఖుడు, తెల్విలేని కాంగ్రెస్ నాయకుడు.. 'తెలంగాణలో బతుకమ్మను పెత్తందార్లు, దొరసానులు ఆడతారు' అని అంటున్నడు. అదీ కాంగ్రెస్ వాళ్ల అహంకారం. రెండ్రోజులు పోతే.. 'బతుకమ్మ ఇక్కడి పండుగ కాదు.. ఇక్కడ ఆడరు' అని చెబుతారు. ఆ కుట్ర కూడా జరుగుతున్నది. తెలంగాణ ఉద్యమానికి ప్రతీక అయిన బతుకమ్మను నిర్లక్ష్యం చేయడం క్షమించరాని నేరం.

> ### “ సీఎం రాక్షసానందం
>
> **విత్తు** ఒక్కటైతే.. చెట్టు ఇంకోటైతదా? గతంలో 'మా నాయన పోలీసు పటేల్.. మేము భూస్వాములం, మాకు అన్నీ ఉన్నాయి' అని సీఎం చెప్పాడు. నాడు తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టాడు. ఇప్పుడు వీడియో గేమ్ ఆడినట్లు బూటకపు ఎన్‌కౌంటర్లు చేయిస్తూ.. రాక్షసానందం పొందుతున్నాడు. ఆయనకు అదో సరదా. 'రక్తం పారంది ఎన్నడో నా తెలంగాణలో.. నేలకు రాలందెన్నడో నా తెలంగాణలో' అని పాట పాడాం. అవార్డు అందుకున్న అర్భక కవి ఈ బూటకపు ఎన్‌కౌంటర్లపై ఏం రాస్తడు? అవార్డు అందుకోగానే ఆయన రాసిన రక్తపు మరకల రాతలన్నీ మాయమైనయేమో! 'రాజ్యహింస పెరుగుతున్నాదో' అనే పాటలు ఇప్పుడేం గావాలె? ఈ ఎన్‌కౌంటర్లకు ఏమని సమాధానం చెప్పాలె?

**తెలంగాణ తల్లిని మార్చడంపై మీ స్పందన..?**

**ఉద్యమ** బాటలో, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షతో 2006లో తెలంగాణ తల్లిని రూపొందించుకున్నం. ప్రజల కోరిక మేరకు, మేధావుల సూచనలతో కేసీఆర్ గారి ఆధ్వర్యంలో ప్రజలంతా ఊరూరా ఆ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నరు. ఆ తల్లిని అవమానిస్తూ కాంగ్రెస్ వ్యాఖ్యలు చేయడం దారుణం. ఈ కొత్త విగ్రహంలో బతుకమ్మను తీసేసి మొండిచేయి పెట్టి, కొలవండ్రా అంటే.. కొంతమంది అర్భక కవులు, మూర్ఖులు, పెద్దకవి అనుకునేటోళ్లు ఏవేవో చెబుతున్నరు. అవార్డుల కోసం తెలంగాణ బతుకును, మన బతుకమ్మను వక్రీకరించి, తల్లిని అవమానిస్తున్నరు.

**ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఆవిర్భావ వేడుకలు చేపడతామని ప్రభుత్వం అంటున్నది? దీనిపై మీరేమంటారు?**

**డిసెంబర్ 9** సోనియాగాంధీ పుట్టినరోజు. ఆమె బర్త్‌డే తర్వాతనే మలివిడత ఉద్యమంలో మరణాలు మొదలయ్యాయి. అదే రోజు తెలంగాణ ఇస్తామని చిదంబరం ప్రకటించారు. ఆ మాట వెనక్కి తీసుకోవడం వల్లే వెయ్యిమందికిపైగా తెలంగాణ బిడ్డలు బలవన్మరణం పాలయ్యారు. ఉద్యమంలో 'జై తెలంగాణ' అనని పార్టీ కాంగ్రెస్. అనేకమంది ప్రాణాలు పోవడానికి మూల కారణం కాంగ్రెస్. తెలంగాణ బిడ్డలను పొట్టన పెట్టుకున్న ఆ పార్టీ.. దొడ్డిదారిన డిసెంబర్ 9న ఉత్సవాలు జరపడం హేయం.

**కొత్తపాటలు విడుదల చేశారు కదా! స్పందన ఎలా ఉంది?**

**తెలంగాణ** సంస్కృతిపై జరిగిన దాడి గురించి పాటలు పాడితే.. మన బిడ్డలు నిజం చెప్పావని అభినందించారు. కొందరు సమైక్యవాదులు చంపేస్తామని బెదిరిస్తున్నారు. సమైక్య పాలకులను, ఆంధ్రా పెట్టుబడిదారులను పాటలతోనే ప్రశ్నించాం. ఆనాడే బెదిరింపులకు, అరెస్టులకు వెరవలేదు. ఇప్పుడెందుకు భయపడతాం? బయటోడు ద్రోహం చేస్తే.. తరిమికొట్టినం. ఇక్కడోడు ద్రోహం చేస్తుండు.. ఈడనే బొందవెడ్తం. కాళోజీ కలం సాక్షిగా.. 'ధూంధాం' పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తం. తెలంగాణను దోపిడీ చేస్తూ, మన బతుకులను చిన్నాభిన్నం చేస్తున్న వారిని ఇక్కడ పాతిపెట్టే వరకూ మా ఆటా, పాటా ఆగవు.

... రవికుమార్ తోటపల్లి